సాక్షి మంచిర్యాల

గురువారం, 19, జూన్, 2025



కేజీబీవీల్లో నూతన మెనూ

కేజీబీవీల్లో విద్యార్థినులకు పౌష్టికాహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ విద్యాసంవత్సరం నుంచి నూతన మెనూ అమలు చేయనుంది. 8లో▸



సమస్యలు పరిష్కరించాలి

రామకృష్ణాపూర్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ కార్యదర్శి అనితారాంచంద్రన్‌కు దివ్యాంగుల చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మెడపట్ల సతీష్ వినతిపత్రం అందజేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0 /29.0

మధ్యాహ్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రివేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన మంత్రి వివేక్



శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి నాగేశ్వర్‌రావు

చెన్నూర్: రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి బుధవారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. బాధ్యతలు స్వీకరించిన మంత్రి వివేక్‌కు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ శుభాకాంక్షలు తెలిపారు.

జీసీసీ ఇన్‌చార్జి మేనేజర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజ్‌కుమార్

జన్నారం: జన్నారం జీసీసీ ఇన్‌చార్జి మేనేజర్‌గా మరిపెల్లి రాజ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన ఆయన జీసీసీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్నారు. ఇటీవల ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా జీసీసీ మేనేజర్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. రాజ్‌కుమార్‌ను ఇన్‌చార్జి మేనేజర్‌గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేయగా ఆయన బాధ్యతలు చేపట్టారు. గిరిజన సహకార సంస్థ ద్వారా గిరిజనులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తానని తెలిపారు.

ఎస్సీ కళాశాల వసతిగృహాల తనిఖీ



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న రాజేశ్వరి

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ బాలుర, బాలికల కళాశాల వసతిగృహాలను సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రాజేశ్వరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల పదోన్నతిపై వచ్చిన ఆమె బాలుర వసతిగృహం కిచెన్ గది, సరుకులు పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టిక తనిఖీ చేశారు. వసతిగృహ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్సీ బాలికల వసతిగృహం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమాధికారి రవీందర్, వసతిగృహ సంక్షేమ అధికారులు కుమారస్వామి, చందన పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆగడాలు అరికట్టాలి

- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య




గణేష్‌ను పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న చిన్నయ్య

మంచిర్యాలటౌన్: బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ అండ చూసుకుని చేస్తున్న ఆగడాలను అరికట్టాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గణేష్, ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం జరిగిన దాడిలో గాయపడి మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం చిన్నయ్య పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'గడ్డం' కుటుంబానికి మంత్రి పదవి వచ్చిన తర్వాత బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లోని ప్రతీ మండలంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. బెల్లంపల్లిలో గణేష్, ఆయన కుటుంబ సభ్యులపై స్థానిక ఎమ్మెల్యే వినోద్ అండతోనే మాజీ జెడ్పీటీసీ రాంచందర్ అనుచరులు దాడులు చేసి గాయపర్చారని, పోలీసు వ్యవస్థ చోద్యం చూస్తోందని ఆరోపించారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కాంగ్రెస్ పార్టీ నాయకులకు మద్దతుగా నిలుస్తున్నారని అన్నారు. రామగుండం పోలీసు కమిషనర్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫీజుల మోత!

ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభిస్తున్న ఓ కార్పొరేట్ సంస్థ ఏడాదిన్నర చిన్నారులకు ప్లే స్కూల్ మొదలు ప్రీ, ప్రైమరీ స్థాయిలోనే రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తోంది. ఇక్కడ నర్సరీ క్లాస్‌కు ఫీజు రూ.40వేలకు పైగా ఉంది. అడ్మిషన్, యూనిఫాం, షూ, బుక్స్‌కు అదనంగా చెల్లించాల్సిందే. నర్సరీ విద్యార్థికే ఏడాదికి రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.



- కార్పొరేట్ స్కూళ్లలో రూ.లక్షల్లోనే..
- ప్రైవేటు విద్యాసంస్థల్లో భారీగా పెంపు
- పుస్తకాల నుంచి సాక్సుల దాక విక్రయాలు
- పేద, మధ్య తరగతి తల్లిదండ్రులపై ఆర్థిక భారం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల మోత మోగుతోంది. ప్రైవేటు విద్యాసంస్థలపై నియంత్రణ లేక ఇష్టారీతిన వసూళ్ల పర్వం సాగుతోంది. విద్యాసంవత్సరం ఆరంభం కావడంతో అడ్మిషన్లు జరుగుతున్నాయి. నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఆయా స్కూళ్లలో రూ.వేలల్లో ఫీజులు పెంచేస్తున్నారు. పేరున్న విద్యాసంస్థలో చదివించాలంటే ప్రైమరీ స్థాయిలోనే రూ.లక్ష వరకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో తరహా జిల్లాలోనూ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఏటేటా తరగతులను బట్టి ఫీజులు పెంచేస్తున్నారు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు స్టేట్ సిలబస్ పరిధిలో 206స్కూళ్లు ఉండగా, రెండు సీబీఎస్ఈ ఉన్నాయి. వీటి పరిధిలో 60వేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. ఇందులో చాలా వరకు మధ్య తరహా స్కూళ్లు ఉన్నాయి. జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన అంటూ పలు స్కూళ్లు ప్రచారం చేస్తూ తల్లిదండ్రుల నుంచి ఫీజులు గుంజుతున్నాయి.

ప్రైవేటుకే పరుగు

సర్కారు బడుల్లో విద్యతోపాటు పుస్తకాలు, యూనిఫాంతో సహా మధ్యాహ్నం భోజన వసతి సహా అన్నీ ఉచితంగా పొందవచ్చు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు అధికంగా ప్రైవేటుకే మొగ్గు చూపుతున్నారు. తమ పిల్లలను ఉన్నతంగా చదివించి ప్రయోజకులను చేయాలనే ఉద్దేశంతో తమ స్థాయి, ఆర్థిక స్థోమతకు మించి విద్య కోసం ఖర్చు చేస్తున్నారు. తల్లిదండ్రుల బలహీనత కార్పొరేట్ ప్రైవేటు సంస్థలకు క్యాష్‌గా మారింది.

అన్నీ స్కూల్‌లోనే..

ప్రైవేటు విద్యాసంస్థల్లో కేవలం చదువు కోసం ట్యూషన్ ఫీజులకే కాకుండా పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, టైలు, బెల్టులు, ఆఖరుకు సాక్సులు సైతం వారే అమ్ముతున్నారు. నేరుగా కాకుండా తమకు కమిషన్ ఇచ్చే విక్రయదారులతో అమ్మకాలు సాగిస్తున్నారు. ఎంపిక చేసుకున్న పుస్తకాలు పబ్లిషర్ల పేరు చెబుతూ రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు. యూనిఫాం సైతం బట్టల దుకాణదారులతో ఒప్పందం మేరకు అమ్మేస్తున్నారు. తల్లిదండ్రులు అప్పులు చేస్తూ తమ పిల్లల భవిష్యత్ బాగుంటుదనే కోణంలో రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

ఫ్రాంచైజీలతో నిర్వహణ

ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల ప్రవేశాల కోసం అనేక రకాల వసతులు కల్పిస్తున్నామని చెబుతూ భారీగా ఫీజులు తీసుకుంటున్నారు. ఫ్రాంచైజీలతో నిర్వహిస్తూ టెక్నో, డీ జీ, ఐఐటీ, నీట్ ఫౌండేషన్, ఏసీ క్యాంపస్ అంటూ ఆ మేరకు ఫీజులు నిర్ణయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతోనే సీబీఎస్ఈ కరి క్యులం బోధగా చెబుతున్నారు. చాలా స్కూళ్ల కు పక్కా భవనాలు లేవు. అపార్ట్‌మెంట్లలో నిర్వహిస్తున్నారు. చాలా స్కూళ్లకు మైదానాలే లేవు. అగ్నిమాపక రక్షణ లేదు. బోధన చేసే వారిలో చాలామంది కనీసం బీఈడీ లేని టీచ ర్లు ఉండడం గమనార్హం. జిల్లా విద్యాశాఖ ప్రైవేటు విద్యాసంస్థలపై పర్యవేక్షణ కొరవడడంతో మరింత గాడితప్పుతోందనే విమర్శలు ఉన్నాయి.

క్వారీ జంగల్ సఫారీకి నూతన వాహనాలు



వాహనంలో ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, ఎఫ్ఆర్ఓ సుభాశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్పూర్ గ్రామ పంచాయతీ పరిధి కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలో గాంధారీ ఖిల్లా సఫారీ కోసం బుధవారం నూతనంగా రెండు వాహనాలు ప్రారంభించారు. 25 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జంగల్ సఫారీలో ఆహ్లాదకరంగా పర్యటిస్తూ సురక్షితమైన, రమణీయమైన అనుభవాన్ని పొందేందుకు వీలుగా వాహనాలు రూపొందించినట్లు ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ తెలిపారు. ఎలాంటి శబ్ద కాలుష్యం లేకుండా అటవీ జంతువులను మరింత దగ్గరగా వీక్షించేలా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. సఫారీ మొత్తం ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా ప్రకటించామని తెలిపారు. లక్సెట్టిపేట ఎఫ్ఆర్ఓ అత్తె సుభాశ్, అటవీ సెక్షన్ అధికారి అతావుల్లా, అటవీ బీట్ అధికారులు రాజేందర్, స్వప్న పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తుల స్వీకరణ

పాతమంచిర్యాల: రైతుభరోసా పథకం కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం–2025 కోసం జూన్ నాటికి కొత్తగా పట్టాపాస్ బుక్‌లు పొందిన రైతులు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. గత సంవత్సరం దరఖాస్తు చేసుకోని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20లోగా దరఖాస్తు ఫారంతోపాటు పట్టాపాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పాస్‌బుక్ జిరాక్సు కాపీలతో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

బెల్లంపల్లి పట్టణంలో సమస్యలా..!

- 'సాక్షి' ఆధ్వర్యంలో రేపు ఫోన్ ఇన్



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాల్టీలోని ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి 'సాక్షి' ముందుకొచ్చింది. 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. వర్షాకాలం దృష్ట్యా మీ పరిధిలోని సమస్యలను ప్రస్తావించి పరిష్కారం కోరవచ్చు. మున్సిపల్ కమిషనర్ కే.శ్రీనివాసరావు ప్రజలకు అందుబాటులో ఉంటారు.

సమయం : శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సంప్రదించాల్సిన నంబరు : **98499 05887, 97019 09596**

సామాజిక భద్రతకు పింఛన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

పాతమంచిర్యాల: సమాజంలో గౌరవం, సామాజిక భద్రత కల్పించడంతోపాటు ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్ పథకం అమలు చేస్తోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేయూత పింఛన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వృద్ధులు, దివ్యాంగులు, ఎయిడ్స్ బాధితులు, డయాలసిస్, ఫైలేరియా వ్యాధిగ్రస్తులు, వితంతువులు, నేత, గీత, బీడీ కార్మికులకు, బీడీ టేకేదారులు, ఒంటరి మహిళలకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. పింఛన్ దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని, పేర్ల చేర్పులు, తొలగింపులపై ప్రజలకు వివరించాలని అన్నా రు. ఈ సమావేశంలో సెర్ప్ సంచాలకులు గోపాల్‌రావు, డీఆర్డీవో కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో గణపతి, మున్సి పల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు, తపాలాశాఖ అధికారులు పాల్గొన్నారు.

భూభారతిని వినియోగించుకోవాలి

లక్సెట్టిపేట: ప్రజలు భూభారతి చట్టాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని రైతువేదిక భవనంలో, మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అధి కారులు ప్రజల దరఖాస్తులను పూర్తిగా పరిశీలించాలని అన్నారు. అనంతరం కేజీబీవీ, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మౌలిక సదుపాయాలు, పుస్తకా లు, అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలి



సరుకులు పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

లక్సెట్టిపేట: విద్యార్థులను ఉపాధ్యాయులు బాధ్యతగా పాఠశాలలో చేర్పించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించి మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థులకు అన్ని విధాల సౌకర్యాలు ఉన్నాయని తెలియజేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందరికీ నాణ్యమైన విద్యతోపాటు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. అనంతరం పాఠశాలను పరిశీలించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శోభారా ణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో విచారణ

దండేపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీని డీఈవో యాదయ్య బుధవారం సందర్శించారు. సిబ్బంది సమయానికి రావడం లేదని, భోజనం సరిగా పెట్ట డం లేదని ఇటీవల కొందరు విద్యార్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీఈవో విచారణ జరిపారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. అనంతరం వంట సరుకులు పరిశీలించి గడువు ముగిసిన మసాల పొడిని పడేయాలని నిర్వాహకులకు సూచించారు. సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, ఎంఈవో చిన్నయ్య, సీసీవో మల్లేష్ పాల్గొన్నారు.

పెళ్లి.. విడాకులు..!

- చిచ్చురేపుతున్న అనుమానాలు
- పెళ్లయిన ఏడాది నుంచే గొడవలు
- కౌన్సెలింగ్ ఇచ్చినా మారని తీరు
- విచ్ఛిన్నం అవుతున్న కుటుంబాలు



కుటుంబ సమస్యతో వచ్చిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ నరేష్‌కుమార్(ఫైల్)

మంచిర్యాలక్రైం: మూడు ముళ్లు.. ఏడడుగుల బంధంతో ఒక్కటవుతున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుని జీవితంలో కష్టసుఖాలను సమానంగా పంచుకుంటామని పెళ్లిలో బాస చేస్తున్నారు. కానీ కొత్త జంటలు ఆధిపత్య పోరు.. వివాహేతర సంబంధాలు.. అనుమానాలు.. అపోహలతో సంసార జీవితాన్ని విచ్ఛిన్నం చేసుకుంటున్నారు. నాలుగు గోడల మధ్య సర్దిచెప్పాల్సిన ఇరు కుటుంబాల పెద్దలు ఒక్కోసారి మరింత ఆజ్యం పోస్తున్నారు. చిలిపి తగాదాలను భూతద్దంలో చూస్తూ బంధాన్ని బలహీనం చేస్తున్నారు. ఒక్కోసారి విడాకులకూ వెనుదీయడం లేదు. ఏడాది తిరక్కముందే భార్యాభర్తలు విడాకులకు పెద్దలను ఆశ్రయిస్తున్నారు. వారు కాదంటే కోర్టు మెట్లెక్కుతున్నారు.

చిన్న చిన్న సమస్యలకే..

జిల్లాలో చిన్న చిన్న తగాదాలకే పోలీసుస్టేషన్లు, కోర్టు వరకు వెళ్లే దంపతుల సంఖ్య పెరిగిపోతోంది. 2024 నుంచి 2025మే వరకు చిన్న చిన్న మనస్పర్థలతో మంచిర్యాల మహిళా పోలీసుస్టేషన్‌లో 388 ఫిర్యాదులు వచ్చాయి. కలిసి ఉండడగానికి ఇష్టపడని మరో 73కుటుంబాలు కోర్టు మెట్లెక్కాయి. వివిధ పోలీసుస్టేషన్లకు వస్తున్న ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం 30ఏళ్లలోపు వారివే ఉండడం గమనార్హం. గొడవ పడే దంపతుల్లో ఎవరూ వెనక్కి తగ్గేందుకు ఇష్టపడడం లేదు. పెళ్లయిన యువతులు కొత్త కాపురంలోకి అడుగు పెట్టగానే అప్పటివరకు ఊహించుకున్నవి గాలిమేడలనే అభిప్రాయానికి వస్తున్నారు. పుట్టిన రోజు మర్చిపోవడం, పండక్కి పుట్టింటికి పంపడం లేదని, పెళ్లికి ముందు వేరే వారితో సంబంధాలు ఉన్నాయనే అనుమానాలు, అపోహలకు గురై సమస్య జటిలమయ్యే వరకు వెళ్తోంది. స్నేహితులు, బంధువులు, ఇరుగుపొరుగు వారిలో ఎవరు ఒకరు లేనిపోని అనుమానాలు పెంచుతున్నారు. వారు చెప్పేది నిజమా కాదా అని ఆలోచించకుండా దంపతులు ఒకరిపైనొకరు ద్వేషం పెంచుకుంటున్నారు. ఇలాంటి జంటలకు కౌన్సెలింగ్ ఇస్తున్నా మార్పు రాకపోవడం వల్ల విడాకుల వరకు వెళ్తున్నారు.

ప్రేమ వివాహాల్లోనే అధికం

పోలీసుస్టేషన్లను ఆశ్రయిస్తున్న వారిలో ప్రేమ వివాహాలు చేసుకున్న వారే ఎక్కువ మంది ఉంటున్నారు. యుక్త వయస్సులో ఆకర్షణకు లోనై ప్రేమలో పడి పెళ్లి చేసుకుంటున్నారు. పిల్లలు పుట్టాక ఆర్థిక సమస్యలు ఎదురై కలహాలు మొదలవుతున్నాయి. ముందే ప్రేమికులు కావడంతో స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా భార్యాభర్తలు పంతాలకు వెళ్తున్నారు.

పోలీసులు ఏం చెబుతున్నారంటే..

కాపురంలో భరించలేనంత ఆర్థిక ఇబ్బందులేమీ కనిపించవు. కానీ ఒకరినొకరు శత్రువుల్లా భావిస్తున్నారు. పోలీసులను ఆశ్రయిస్తున్న దంపతుల్లో పెళ్లయి ఏడాది నుంచి నాలుగేళ్లలోపు వారే ఎక్కువ ఉంటున్నారు. విడాకులకు చెప్పే కారణాలు చాలా చిన్నవిగా ఉంటున్నాయి. ఉన్నత విద్యావంతులైన భార్యాభర్తలు కూడా ఎవరి స్వేచ్ఛ వారిదే అనే పద్ధతిలో పంతాలకు పోతున్నారు. ప్రేమ వివాహాలు చేసుకున్న వారు కూడా ఏడాది రెండేళ్లకే అర్థం లేని పట్టింపులు, గొడవలతో విడాకుల వరకు వెళ్తున్నారు.

- మంచిర్యాలకు చెందిన ఉద్యోగి రాజు(పేరు మార్చాం) జన్నారానికి చెందిన ఓ మహిళను పెళ్లి చేసుకున్నాడు. ఆనందమయ జీవితానికి గుర్తుగా కూతురు జన్మించింది. ఆ తర్వాత రాజు తన భార్యకు వరుసకు చెల్లెలు అయిన యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగి కులపెద్దల వద్ద పలుమార్లు పంచాయితీ జరిగింది. అయినా మార్పు రాక కోర్టు వరకు వెళ్లింది. కేసు కోర్టులో ఉండగానే సదరు యువతిని రాజు రహస్యంగా రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య కూతురుతో కలిసి కోర్టు చుట్టూ తిరుగుతోంది.
- బెల్లంపల్లికి చెందిన గీత(పేరు మార్చాం)కు అదే ప్రాంతానికి చెందిన విజయ్(పేరు మార్చాం)తో పెద్ద సమక్షంలో పెళ్లి జరిగింది. పెళ్లయిన వారం రోజులకే తమ ఊరిలో స్నేహితురాలి పెళ్లి ఉందంటూ ఇంట్లో నగలన్నీ తీసుకుని పెళ్లికి ముందు ప్రేమించిన మరో యువకుడితో వెళ్లిపోయి పెళ్లి చేసుకుంది. తన భార్య అదృశ్యమైందని విజయ్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు గాలించి గీత, ప్రేమికుడిని పట్టుకున్నారు. విజయ్ వారిద్దరిపై కేసు పెట్టాడు. మూడేళ్ల తర్వాత గీత విజయ్‌పై కేసు పెట్టగా.. పోలీసులు ఫాల్స్ చేశారు. కానీ గీత కోర్టు నుంచి మళ్లీ ఓపెన్ చేయించి విజయ్ కోర్టు మెట్లెక్కేలా చేసింది.

మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	ఫిర్యాదులు	కౌన్సెలింగ్	ఎఫ్ఐఆర్	పెండింగ్
2023	315	252	63	00
2024	242	197	45	00
2025(మే వరకు)	195	138	50	06

విభేదాలకు కారణాలు...

- మద్యం కారణంగా గొడవలు: 33శాతం
- వరకట్నపు వేధింపులు: 31శాతం
- వివాహేతర సంబంధాలు/అనుమానాలు : 26శాతం
- మగపిల్లలు పుట్టలేదని/సంతానం లేదని : 5శాతం
- ఇతర కారణాలు : 5శాతం

మనస్పర్థలు పెరిగి గొడవలు



చిన్న చిన్న కారణాలకే దంపతుల మధ్య మనస్పర్థలు పెరిగి గొడవలకు దారి తీస్తున్నాయి. దీంతో ఇరువురు పోలీస్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇరు కుటుంబాల సభ్యులతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇస్తూ చాలామంది లో మార్పు తీసుకొస్తున్నాం. అయినా కొంద రు కోర్టు దాకా వెళ్తూ విడాకులు కోరుకుంటున్నారు. పలు సమస్యలతో దంపతుల మధ్య సఖ్యత తగ్గి పోలీస్‌స్టేషన్ వరకు వస్తున్నారు. కొన్ని కుటుంబాలు పంతాలకు వెళ్లి కోర్టుకు వెళ్తున్నారు.

– నరేష్‌కుమార్, సీఐ, మహిళా పోలీస్‌స్టేషన్, మంచిర్యాల

కుటుంబ వ్యవస్థపై అవగాహన ఉండాలి



ప్రస్తుత పరిస్థితుల్లో యువ జంటలకు కుటుంబ వ్యవస్థపై అవగాహన, సర్దుబాటు ధోరణి లేకపోవడం వల్లనే విడాకుల కోసం కోర్టును ఆశ్రయిస్తున్నారు. తల్లిదండ్రుల పెంపక లోపం, ఆర్థిక స్వేచ్ఛ, అహంకారం, అ క్రమ సంబంధాలు కూడా విడాకులకు కారణమవుతున్నాయి, కుటుంబ వ్యవస్థ సక్రమంగా నిలబడాలంటే స్త్రీ పాత్ర ముఖ్యమైనది. ఎంతటి సమస్య అయినా కూర్చుని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతుంది.

– డాక్టర్ విశ్వేశ్వర్‌రావు, మానసిక వైద్య నిపుణులు, మంచిర్యాల

క్లుప్తంగా

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి శివారులో బుధవారం ప్రాణహిత నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న పెద్దింటి రాజు, మానిశెట్టి ప్రశాంత్ అనే వ్యక్తులను పట్టుకుని ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ప్రాణహిత నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ దస్తగిరి ఉన్నారు.

విద్యార్థినులను వేధించిన యువకుడిపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ విద్యార్థినులను వేధించిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి ఎస్సై హైమా బుధవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మెడికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు కళాశాలకు వెళ్లి వచ్చేటప్పుడు కాలేజ్‌రోడ్డులోని ఓ చికెన్ సెంటర్‌లో పని చేసే యువకుడు తన ప్రైవేటు భాగాలు చూపిస్తూ వేధిస్తున్నాడని అందిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

గొలుసు చోరీకి విఫలయత్నం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో బుధవారం ఓ మహిళ గొలుసు దొంగతనానికి విఫలయత్నం చేసింది. పట్టణ ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరిగాం గ్రామానికి చెందిన సాయవ్వ పిల్లల స్కూల్ ఫీజు కట్టేందుకు నిర్మల్‌కు వచ్చింది. తిరిగి వెళ్లే క్రమంలో బస్టాండ్ ప్రాంతంలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఆగింది. ఆ సమయంలో గంగామణి అనే మహిళ సాయవ్వ మెడలోని బంగారు గొలుసు చోరీ చేసేందుకు యత్నించింది. వెంటనే సాయవ్వ దొంగా అని అరవడంతో.. స్థానికులు గంగామణిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్కూల్ బస్సు డ్రైవర్‌పై యువకుల దాడి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌పై నలుగురు యువకులు దాడి చేసినట్లు సీఐ ప్రమోద్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుధవారం స్కూల్ బస్సు డ్రైవర్ చిప్పకుర్తి శ్రీనివాస్ ముల్కల్ల వైపు నుంచి మంచిర్యాలకు వస్తుండగా వెనుక నుంచి మద్యం మత్తులో నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై వచ్చి ఓవర్ టేక్ చేసి స్థానిక ఐబీ చౌరస్తాలో బస్సుకు అడ్డంగా వాహనాలు నిలిపారు. బస్సు డ్రైవర్ శ్రీనును కిందకు దించి చితకబాదారు. ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఆపేందుకు ప్రయత్నించగా దురుసుగా ప్రవర్తించారు. ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. బస్సు డ్రైవర్ శ్రీను ఫిర్యాదు మేరకు కాలేజిరోడ్‌కు చెందిన కరవేణి మనోజ్, మత్తునూరి వినయ్, మేకల వెంకటసాయి, ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన మామిడిపల్లి చందులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

బెల్లంపల్లిరూరల్: ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కింద పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి పట్టణంలో చోటు చేసుకుంది. టూ టౌన్ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ సుభాష్‌నగర్‌కు చెందిన కాలేగుర రియాన్(6) పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. రోజువారీగా బుధవారం పాఠశాలకు ఆటోలో వెళ్లాడు. సాయంత్రం పాఠశాల అనంతరం ఆటోలో ఇంటికి వస్తున్న క్రమంలో ఆటో సుభాష్‌నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోకి రాగా ఆటో డ్రైవర్ నల్లాల రాజేశ్ ఆటోను అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ఒక్కసారిగా మలుపు తిప్పడంతో ఆటోలో ఉన్న రియాన్ రోడ్డుపై పడిపోయాడు. దీంతో రియాన్ తలకు బలంగా గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు హుటాహుటిన రియాన్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రియాన్ తండ్రి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కేజీబీవీల్లో నూతన మెనూ

- పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- విద్యార్థినులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు
- పెరిగిన మెస్‌చార్జీలతో విద్యార్థినుల హర్షం


సోన్ కేజీబీవీ భవనం

లక్ష్మణచాంద: నిరుపేద బాలికలు మధ్యలో చదువు ఆపేయకుండా, వారిని అక్కున చేర్చుకుని కేజీబీవీలు వసతితో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నాయి. కేజీబీవీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. కేజీబీవీ విద్యార్థినులు పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్నట్లు ఇటీవల చేపట్టిన సర్వేలో తేలింది. దీంతో కేజీబీవీ బాలికల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న బాలికలకు పౌష్టికాహారం అందించి వారిని అనారోగ్య సమస్యల నుంచి దూరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గతంలో ఉన్న మెనూలో పలు మార్పులు చేసింది. దీంతో 2025 –26 విద్యా సంవత్సరంలో నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించనున్నారు.

పెరిగిన మెస్ చార్జీలు

గతంలో 6 –10, ఇంటర్ విద్యార్థులందరికీ ఒకే విధంగా నెలకు రూ.1225లు ప్రభుత్వం అందించేది. కానీ నేడు నూతన మెనూ ప్రకారం 6 నుంచి 7వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.1330లు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.1540లు, ఇంటర్ విద్యార్థులకు నెలకు రూ.2100లు అందించనున్నారు.

నూతన మెనూ ఇదే..

ఉదయం..టమాట కిచిడి, సాంబారు, బూస్టు, పూరి, రాగి జావ, ఉప్మా, పులిహోర, వడ, బోండా, చపాతి, జీరా రైస్‌తో పాటు రోజుకు ఒక్కో రకమైన పండ్లు అందించాలి. ఇందులో అరటి పండు, జామ, వాటర్ మిలన్, బొప్పాయి, సపోట వంటి పండ్లు అందించాలి.
మధ్యాహ్నం..టమాట పప్పుతో కూడిన అన్నం, నెయ్యి, రసం, పెరుగు, ఉడక బెట్టిన గుడ్డు, చికెన్ అందించాలి.
సాయంత్రం..ఉడకబెట్టిన శనగలు, కోడిగుడ్డు బజ్జీ, బెల్లం పల్లీలు, అల్లం చాయ్, మిల్లెట్ బిస్కెట్లు, పకోడి ఇవ్వాలి.
రాత్రి వేళ..వివిధ రకాల కూరలతో తయారు చేసిన అన్నం, సాంబారు, మజ్జిగ అందించాలి. నెలలో రెండు సార్లు మటన్, అయిదుసార్లు గుడ్లు, ప్రతీరోజు నెయ్యి అందించాలి.

ఉమ్మడి జిల్లా కేజీబీవీల సమాచారం..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	ఇంటర్ కాలేజీలు	విద్యార్థుల సంఖ్య	మొత్తం
నిర్మల్	18	3600	14	2240	5840
మంచిర్యాల	18	3786	15	1080	4866
ఆదిలాబాద్	18	4800	13	680	5480
కుమురంభీం	15	3027	13	1069	4096

సంతోషంగా ఉంది



కేజీబీవీ బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం నూతన మెనూ అమలు చేయడం సంతోషంగా ఉంది. మెస్ చార్జీలు కూడా పెంచడంతో మాకు ఎంతో ఉపశమనం కలుగుతుంది.
– ప్రసన్న, 10వ తరగతి విద్యార్థిని, కేజీబీవీ, లక్ష్మణచాంద

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



గతానికి భిన్నంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నూతన మెనూ అమలు చేయడం సంతోషంగా ఉంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మంచి పోషకాహారం అందడంతో చదువుపై మరింత దృష్టి సారిస్తాం.
– రిషిప్రియా, ఇంటర్, కేజీబీవీ, లక్ష్మణచాంద

నూతన మెనూ ప్రకారమే..



ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి నూతన మెనూ అమలు చేయాలని కేజీబీవీల ఎస్‌వోలకు సూచించాం. కొత్త మెనూ పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. నూతన మెనూ చార్టులు ఏర్పాటు చేయాలని సూచించాం.
– సలోమి కరుణ, సెక్టోరియల్ అధికారి, నిర్మల్

బస్సు ఢీకొని ఒకరి మృతి


ఘటనా స్థలంలో చంద్రశేఖర్ మృతదేహం


ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన బొడిగంవార్ చంద్రశేఖర్ (49) అనే వ్యక్తి దేగాం గ్రామంలో బస్సు ఢీకొట్టిన సంఘటనలో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన బొడిగంవార్ చంద్రశేఖర్ –సుశీల దంపతులు బుధవారం బాసరకు వెళ్తున్నారు. దేగాం బస్టాండ్ వద్ద బస్సు కోసం వేచిచూస్తున్న క్రమంలో చంద్రశేఖర్‌ను భైంసా నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు దేగాం చేరుకుని న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..


సాయినాథ్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని సాత్‌పూల్ వంతెన సమీపంలో లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తానూర్ మండలం బెలతరోడకు చెందిన చెంచుల సాయినాథ్(37) బుధవారం బెల్‌తరోడ వెళ్లి బైక్‌పై భైంసా తిరిగి వస్తున్నాడు. సాత్‌పూల్ వంతెన వద్దకు చేరుకోగా, నిర్మల్ వైపు నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న సాయినాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఎండీ గౌసుద్దీన్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపినాథ్ తెలిపారు. సాయినాథ్‌కు భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.

ఇద్దరు వ్యక్తుల బైండోవర్


ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేసిన పోలీసులు

లక్సెట్టిపేట: మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన ధనిశెట్టి సతీశ్, కారుకూరి మల్లేశ్ అనే ఇద్దరు వ్యక్తులను స్థానిక తహసీల్దార్ దిలీప్ కుమార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ధనిశెట్టి సతీశ్, కారుకూరి మల్లేశ్ అనే వ్యక్తులు గత కొద్ది రోజుల నుంచి కారణం లేకుండానే 100 నంబర్‌కు డయల్ చేస్తున్నారు. పలుమార్లు ఈవిధంగా డయల్ చేస్తూ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, ఎలాంటి సమస్యలు లేకున్నా ఫోన్ చేస్తున్నందున బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన బిల్ల దేవక్క(59) అనే వృద్ధురాలు అనారోగ్యం భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దేవక్క గత కొన్నేళ్లుగా బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి అనారోగ్యం సమస్యలతో బాధపడుతుంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం ఇంటి ఆవరణలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. దేవక్క కూతురు శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కుంటలో దూకి యువకుడు..

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామానికి చెందిన బన్సోడే కరణ్(25) అనే యువకుడు గ్రామ సమీపంలోని కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై శంకర్ తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరణ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో తాత్కాలిక పద్ధతి న పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన ఆయన ఈనెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికారు. బుధవారం స్థానికులకు గ్రామ సమీపంలోని కుంటలో మృతదేహం కన్పించడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

లక్సెట్టిపేట: విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దండెపల్లి, జన్నారం మండలాల నుంచి వచ్చిన 12 దరఖాస్తులు స్వీకరించారు.

కూల్చివేతకు సిద్ధంగా కళాశాల భవనం


కొలతలు తీసుకుంటున్న ఇంజినీర్ అఖిలేష్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిథిలావస్థలో గల పురాతన భవనం కూల్చివేతకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో చర్యలకు ఉపక్రమించారు. భవనం శిథిలావస్థకు చేరిందని కూలితే విద్యార్థులకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఇంజినీర్ అఖిలేష్‌తో కలిసి బుధవారం కూల్చివేత అనుమతుల కోసం కొలతలు తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వేలాది మంది విద్యార్థులు చదువుకున్న భవనం కూల్చివేస్తున్న విషయం తెలియగా పలువురు కలత చెందుతున్నారు. ఈ భవనాన్ని 1969లో నిర్మించినట్లుగా తెలుస్తోంది.

ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌కు కొణతం దిలీప్

ఖానాపూర్: గతంలో సోషల్‌మీడియాలో కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి కొణతం దిలీప్‌పై నమోదైన కేసులో భాగంగా బుధవారం ఆయన ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో హాజరయ్యారు. ఫిబ్రవరిలో నమోదైన కేసులో ఇది వరకే బెయిల్ మంజూరైనప్పటికీ ప్రతీ బుధవారం పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాల్సి ఉంది. ఈక్రమంలో పోలీసులు గంటల తరబడి ఆయన పోలీస్‌స్టేషన్‌లో నిరీక్షించేలా చేశారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీస్‌స్టేషన్ బయట పెద్దఎత్తున గుమిగూడారు.

బెల్గాం అడవుల్లో ఎలుగుబంటి సంచారం


సంచరిస్తున్న ఎలుగుబంటి

కుభీర్: మండలంలోని బెల్గాం అడవుల్లో ఎలుగుబంటి సంచారంతో సమీప ప్రాంతాల వాసులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల క్రితం బెల్గాం గ్రామ శివారులోని చేనులో పని చేసే వారికి ఎలుగుబంటి కన్పించడంతో వారు భయంతో కేకలు వేయగా సమీప అడవిలోకి పారిపోయింది. మండలంలోని బ్రహ్మేశ్వర్, మార్లగొండ అడవుల్లో ఎలుగుబంట్లు ఉన్నట్లు సమాచారం ఉంది. ఎలుగుబంటి కనిపించిందన్న వార్త వ్యాపించడంతో అడవుల సమీపంలోని గ్రామాల ప్రజలు అడవివైపు వెళ్లడానికి జంకుతున్నారు. ఈ విషయమై అటవీ అధికారి లక్ష్మణ్‌ను బుధవారం వివరణ కోరగా ఐదు నుంచి ఆరు ఎలుగుబంట్లు ఉన్నాయని, అవి కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

తల్లి మెడలో గొలుసు అపహరించిన కుమారుడు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

మందమర్రిరూరల్: తల్లి మెడలోని రెండు తులాల బంగారు గొలుసు దొంగిలించిన కుమారుడిని మందమర్రి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. బుధవారం మందమర్రి సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ హాజరై వివరాలు వెల్లడించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు వైపు నివాసం ఉండే విజయపురి పుల్లమ్మ అనే వృద్ధురాలు గత నెల 24న అనారోగ్యంతో బాధపడుతూ మంచం పట్టింది. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తి పుల్లమ్మ మెడలో గొలుసు దొంగిలించినట్లు మనుమడు శివ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉన్నతాధికారుల సూచనలు, సాంకేతికత ఆధారంగా ఇంటి వారే దొంగతనం చేసి ఉంటారనే కోణంలో పుల్లమ్మ కుమారుడు శంకరయ్యపై నిఘా ఉంచారు. ఆయన అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో విచారించగా ఆర్థిక ఇబ్బందుల వల్ల తానే దొంగిలించినట్లు నేరం అంగీకరించాడు. ఈ మేరకు శంకరయ్య వద్ద నుంచి రెండు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న ఎస్సై రాజశేఖర్, క్రైంటీం కానిస్టేబుళ్లు మహేశ్, రాకేశ్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్సైపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

భీమారం: భీమారం ఎస్సై శ్వేత అక్రమ కేసులతో వేధిస్తున్నారని, ఆమెపై హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన బుక్యా రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులం పేరుతో దూషిస్తున్నారని, విచారణ లేకుండా కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ జరపాలని కమిషన్ రామగుండం సీపీకి లేఖ రాసినట్లు పేర్కొన్నారు. కాగా, ఈ విషయమై ఎస్సై శ్వేతను సంప్రదించగా.. రాజ్‌కుమార్ గ్రామంలో రౌడీయిజం, అక్రమ పనులు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో విచారణ చేస్తున్నామన్నారు. సహించలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

భూ వివాదంలో ఇరువర్గాల దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామ శివారులో జరిగిన భూ వివాదంలో ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. తాళ్లగురిజాల ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాతబెల్లంపల్లి గ్రామానికి చెందిన పనాస గణేశ్ ఆకెనపల్లి శివారు సర్వే నంబర్ 64లో ఉన్న భూమిని మంగళవారం సాయంత్రం దున్నే క్రమంలో పాతబెల్లంపల్లి గ్రామానికి చెందిన సింగతి హైమావతి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి రాళ్లతో పరస్పర దాడులకు దిగారు. దాడిలో పలువురికి గాయాలయ్యాయి. బాధితులను బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలకు చెందిన పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూకబ్జాకు యత్నం.. ఆరుగురి రిమాండ్

- నకిలీ పత్రాలతో మహిళకు బెదిరింపులు
- ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణిధర్

ఆదిలాబాద్‌రూరల్: భూ కబ్జాకు యత్నించిన ఆరుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్‌రూరల్ సీఐ కె.ఫణిధర్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనుకుంట గ్రామంలోని సర్వే నంబర్ 7/1లోని ఐదెకరాల 10 గుంటల భూమిని కళావతిబాయి 1979లో గడ్డం యాదవరావు అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసింది. 2020లో తన వదిన గైదాని లతా వామన్‌రావుకు విక్రయించింది. ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు యత్నించారు. బినామీల సహకారంతో నకిలీ పత్రాలు సృష్టించి యాదవరావు వారసుల ద్వారా భూమిని కొనుగోలు చేసినట్లు సేల్ అగ్రిమెంట్ దస్తావేజులు తయారు చేశారు. బాధితురాలిని స్థలం వదిలిపెట్టి వెళ్లాలని బెదిరించారు. దీంతో బాధితురాలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో 15 మంది ముఠా సభ్యులు ఉండగా, అందులో బుధవారం ఆరుగురు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సయ్యద్ సాజిద్ అలియాస్ సాజిదొద్దిన్, శాంతినగర్‌కు చెందిన వకులాభరణం ఆదినాథ్, షేక్ వాహిద్, బృందావన్ కాలనీకి చెందిన చింతకుంట్ల సురేశ్, శిఖ్‌ఘాట్‌కు చెందిన సోంజోకి మోహన్‌లాల్, బొక్కల్‌గూడకు చెందిన సయ్యద్ యాహియాలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా మహమ్మద్ ముజాహిద్, పత్తి ముజ్జు, షేక్ అబిద్ షేక్ నూర్, పార్వతీబాయి గడ్డంవర్, గడ్డం ప్రశాంత్, తనూజ నందకుమార్ దేశ్ పాండే, శోభా వినాయక్ కులకర్ణి, గడ్డంవర్ రామారావు, లలితా సుభాష్ లాంబే, దేశ్ పాండే సునీతలు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. భూ కబ్జాలకు యత్నించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన నికోడే నరేశ్ అనే యువకుడికి అత్యాచారం కేసులో పదేళ్ల జైలుశిక్ష, రూ. 40 వేల జరిమానా జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీ రమేశ్ విధించినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ బుధవారం తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం.. గురుడుపేట గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానంటూ నరేశ్ వెంటపడ్డాడు. ఈ క్రమంలో 2017లో చింతలమానెపల్లి మండలానికి చెందిన ఒక వ్యక్తితో యువతికి వివాహం జరిగింది. యువతికి వివాహం జరిగినా నరేశ్ వేధింపుల కారణంగా యువతికి, ఆమె భర్తకు తరుచూ గొడవలు జరిగాయి. సెప్టెంబర్ 25, 2020న రాత్రి సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయటకు వెళ్లిన యువతిపై నరేశ్ అత్యాచారం చేశాడు. పలుమార్లు పంచాయతీ నిర్వహించగా యువతికి భర్తతో విడాకులయ్యాయి. వేధింపులకు గురి చేయడంతో పాటు అత్యాచారం చేసిన నరేశ్‌పై యువతి ఫిర్యాదు చేయడంతో అప్పటి ఏఎస్సై శివాజీ కేసు నమోదు చేశారు. బుధవారం జిల్లాసెషన్స్ కోర్టులో సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో నరేశ్‌కు జడ్జి జైలుశిక్ష ఖరారు చేశారు.

బౌలర్లదే జోరు


డి.లక్ష్మణ్


శ్రీరామ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్ 19 క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తుండగా బుధవారం జరిగిన పోటీల్లో బౌలర్లదే హవా కొనసాగింది. రెడ్, బ్లూ జట్ల మధ్య 50 ఓవర్ల మ్యాచ్ జరగ్గా, బ్లూ జట్టు ముందుగా బ్యాటింగ్ చేసి 39.5 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయ్యింది. రెడ్ జట్టు బౌలర్లు అద్భుతంగా రాణించగా, డి.లక్ష్మణ్ 4 కీలక వికెట్లు సాధించాడు. అనంతరం లక్ష్య చేధనలో రెడ్‌జట్టు 4 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. శ్రీరామ్ 53 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడని కోచ్ ప్రదీప్ తెలిపారు.

ఎస్టీపీపీలో అధికారులను బదిలీ చేయాలి

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో గత పదేళ్లుగా పాతుకుపోయిన సింగరేణి అధికారులను వెంటనే బదిలీ చేయాలని హెచ్‌ఎంఎస్ యూనిట్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణం నుంచి ఇప్పటి వరకు ఇంజినీర్‌గా వచ్చి డీజీఎం స్థాయి దాక ఎదిగినా ప్లాంట్‌లోనే కొందరు అధికారులు ఉన్నారని ఆరోపించారు. ప్రతీ ఏరియాలో బదిలీలు ఉంటాయని కానీ ఇక్కడ మాత్రం బదిలీ చేయకపోవడానికి ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు.

పీఎఫ్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి

నస్పూర్: ఉద్యోగులు పదవీ విరమణ పొందిన తర్వాత ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ నిధి సకాలంలో అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ సూచించారు. బుధవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు చెందిన సీఎంపీఎఫ్ జాయింట్ వర్క్‌షాప్ నిర్వహించారు. సమావేశంలో ఉద్యోగుల పీఎఫ్, పెన్షన్ సంబంధిత సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఎస్‌ఓటూ జీఎం ఎస్. సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ బీభత్స, డీవైజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, మందమర్రి డీవైపీఎం అసిఫ్, బెల్లంపల్లి సీనియర్ పీవో ప్రశాంత్, అధికారులు దేవేందర్‌రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.